నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, శుక్రవారం 7 మార్చి 2025 | MAHABUBABAD



- ప్రదర్శనకు టాప్ మోడల్ వెహికిల్స్
- ఒకే వేదికపైకి ప్రముఖ కంపెనీలు
- వాహన వినియోగదారులకు సువర్ణావకాశం
- 8, 9 తేదీల్లో నగరంలో ఆటో షో

# ఓరుగల్లుకు బ్రాండెడ్ కార్లు

'నమస్తే తెలంగాణ', తెలంగాణ టు డే ఆధ్వర్యంలో నిర్వహణ

వరంగల్, మార్చి 6: చారిత్రక ఓరుగల్లులో ఆటోమొబైల్ రంగంలో పేరున్న ప్రముఖ బ్రాండెడ్ కార్లు, బైక్ కంపెనీలు ఒకే వేదికపైకి వస్తున్నాయి. రాష్ట్ర రాజధానికే పరిమితమైన ఈ వాహనాలు ఇప్పుడు నగరంలో నిర్వహించే ఆటో షో ద్వారా అడుగు పెడుతున్నాయి. హైదరాబాద్ తర్వాత రెండవ పెద్ద నగరం, వేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లో 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టు డే' ఆధ్వర్యంలో 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న ఆటో షోలో బ్రాండెడ్ కంపెనీలు తమ కార్లను ప్రదర్శించనున్నాయి. ఇప్పటి వరకు వరంగల్ మహా నగరంలో షోరూంలు ఏర్పాటు చేయని ఆడీ క్యూత్రీ, వోల్వోఎక్స్ 90 కార్లతో పాటు జీప్ (రాంగ్లర్) కంపెనీలు వస్తున్నాయి. సుమారు 10కి పైగా కార్ల కంపెనీలతో పాటు ద్విచక్రవాహనాల కంపెనీలు ఆటో షోలో తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతున్నాయి. ప్రముఖ బ్రాండెడ్ కార్ల కంపెనీలు ఈ ఆటోషోలో భాగస్వామ్యం అవుతున్నాయి. వీటితో పాటు మోటర్ బైక్, ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలు ఒకే వేదికపై తమ ఉత్పత్తులు ప్రదర్శిస్తుండడంతో వాహనాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ ఆటో షో సువర్ణావకాశంగా మారనుంది. ఈ నేపథ్యంలో నచ్చిన కార్లను ఎంపిక చేసుకుని, బుక్ చేసుకునే అవకాశాన్ని 'నమస్తే తెలంగాణ' కల్పిస్తున్నది.

### స్టాళ్లను ఏర్పాటు చేయనున్న కంపెనీలు

సుమారు 20 ప్రముఖ కార్లు, మోటర్ బైక్, ఎలక్ట్రిక్ కార్లు, బైక్ కంపెనీలను తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి. మారుతి సుజికి, టీవీఎస్, ఏథర్, ఆడీ, స్కోడా, కియా, నెక్సా, ఎంజీ 100, యమహా, రాయల్ ఎన్‌ఫీల్డ్, చేతక్, గ్రీన్‌హోండా, సిట్రోఇన్ కంపెనీలు ఆటో షోలో స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయి. వీటితో పాటు వాహన కొనుగోలుదారులకు రుణాలు అందించేందుకు డీసీసీ బ్యాంక్ తమ స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నది.



### ఒకే వేదిక

బ్రాండెడ్ కార్ల కంపెనీల కార్లు కొనుగోలు చేయాలన్న ఆసక్తి ఉన్న వారు హైదరాబాద్‌కు పరుగులు పెట్టాల్సిన అవసరం లేదు. ఆటోమొబైల్ రంగంలో మంచి పేరున్న కంపెనీల కార్లు, బైక్‌లు ఒకే చోట చూసుకునే అవకాశం కలుగుతోంది. హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో మార్చి 8,9 తేదీల్లో 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టు డే' ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఆటో షో నగరవాసులకు ఎంతో ఉపయోగపడనుంది. నగర ప్రజలు ఆటో షోను సద్వినియోగం చేసుకొని కారు, బైక్ కొనుగోలు చేయాలనుకునే కలను సాకారం చేసుకోవాలి.

# మానేరు వాగులో రోడ్డుపై గుంతలు



రోడ్డు తవ్వడంతో పక్కనుంచి వెళ్తున్న వాహనదారులు

- 'నమస్తే' కథనంతో టోల్ మూత.. ఉచిత రవాణా
- జీర్ణించుకోలేక దుండగుల దుశ్చర్య
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

టేకుమట్ల, మార్చి6 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి శివారు కలికోటపల్లి-పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్ గ్రామాల మధ్య మానేరు వాగులో పోసిన మట్టిరోడ్డుపై కొంతమంది దుండగులు జేసీబీతో గుంతలు తీశారు. మానేరు వాగులో ప్రైవేటు వ్యక్తులు టోల్ వసూలు చేయడాన్ని ఈ నెల 1న 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో ప్రచురితమైన 'దర్జాగా దారి దోపిడీ' కథనానికి అధికారులు స్పందించి టోల్‌ను బంద్ చేయించారు. మరుసటి రోజు కొంతమంది దొంగచాటుగా మళ్లీ వసూళ్లు మొదలు పెట్టడంతో వాహనదారులు అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో వారిని తీవ్రంగా హెచ్చరించారు. దీంతో ఐదు రోజుల పాటు ఉచిత రవాణా కొనసాగింది. ఈ క్రమంలో ఉచిత ప్రయాణాన్ని జీర్ణించుకోలేని ప్రైవేట్ వ్యక్తులు మట్టి రోడ్డుపై గుంతలు తవ్వారు. దీంతో అంతర్ జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డుపై గుంతలు తీసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు. కాగా, రోడ్డు తవ్విన వారిపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆగ్రహం వ్యక్తం చేసి, కలెక్టర్ రాహుల్ శర్మకు ఫోన్ చేసి, పెద్దపల్లి కలెక్టర్‌తో చర్చించి వాగులో ఉచిత రవాణా కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరినట్లు స్థానికులు తెలిపారు.

### ప్రభుత్వం ఏం చేస్తున్నది?

మానేరు వాగులో అనుమతులు లేకుండా నాసిరకంగా మట్టిరోడ్డుని పోసి ప్రైవేటు వ్యక్తులు టోల్ వసూలు చేస్తుంటే ప్రభుత్వం, అధికారులు ఏం చేస్తున్నారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. అంతర్ జిల్లాలను కలిపే రోడ్డును ప్రభుత్వం పోయకపోవడమే కాకుండా, వంతెన నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించి వంతెన పనులు త్వరగా పూర్తి చేయించాలని, అప్పటి వరకు రోడ్డుపై ఉచిత రవాణా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## కాజీపేట మీదుగా హోలీ ప్రత్యేక రైళ్లు

కాజీపేట, మార్చి 6 : కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగా ఉత్తర భారత దేశానికి హోలీ పండుగ ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. చర్లపల్లి-దానాపూర్-చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య (07709/07710), చర్లపల్లి-ముజఫర్‌పూర్-చర్లపల్లి మధ్య (07711/07712) పది ట్రిప్పులు నడవనున్నాయి. చర్లపల్లి-దానాపూర్ రైలు ఈ నెల 9, 19 తేదీల్లో చర్లపల్లి నుంచి మధ్యాహ్నం 3.10కి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.55 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. దానాపూర్ నుంచి ఈ నెల 11, 21 తేదీల్లో మధ్యాహ్నం 3.15కు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. మరో రైలు ఈ నెల 10, 15, 20 తేదీల్లో మధ్యాహ్నం 3.10కి చర్లపల్లిలో బయలుదేరి రెండో రోజు రాత్రి 2.00 గంటలకు ముజఫర్‌పూర్ చేరుకుంటుంది. తిరిగి ఈ నెల 12, 17, 22 తేదీల్లో తెల్లవారుజామున 4.15కు బయలుదేరి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు రెండోరోజు సాయంత్రం 6.00 గంటలకు చేరుకుంటుంది. చర్లపల్లి-దానాపూర్ రైలు కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్ష, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగపూర్, ఇటార్సీ, పిపరియ, నర్సింగ్‌పూర్, మదన్ మహల్, కట్నీ, మైహార్, సట్నా, మాణిక్‌పూర్, ప్రయాగ్‌రాజ్, చోక్కి, పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, బాక్సర్, ఆగ్రా, స్టేషన్లలో ఆగుతుందని తెలిపారు. అలాగే ముజఫర్‌పూర్ రైలు పైస్టేషన్లతో పాటు దానాపూర్, పాటలీపుత్ర, హజ్జీపూర్‌లో ఆగుతుందన్నారు. ఈ ప్రత్యేక రైళ్లకు 2 ఏసీ, 3 ఏసీ, 3 ఏసీ(ఎకానమి), స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలుంటాయని, ఉత్తర భారతదేశానికి రాకపోకలు సాగించే ప్రయాణికులు టికెట్ రిజర్వేషన్ చేసుకోవాలని అధికారులు తెలిపారు.

## సెకండియర్ పరీక్షలు ప్రారంభం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియెట్ సెకండియర్ వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఆయా పరీక్ష కేంద్రాలను కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తనిఖీ చేశారు.



హనుమకొండ ప్రభుత్వ కాలేజీలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థినులు



నీళ్లు లేక పడావుపడిన పొలాలు

ఫీల్డ్ విజిట్

- డిసెంబర్‌లోనే ఎడారిగా మారిన మానేరు వాగు
- చుక్క నీరు తీసుకురాని డీబీఎం 38 కాల్వ
- ఫలితంగా అడుగంటిన బావులు, బోర్లు
- పూడిక తీసినా ఫలితం శూన్యం
- దిక్కులేక పంటలు మధ్యలోనే వదిలేస్తున్న వైనం
- మరో నెల దాటితే సమస్య జఠిలమయ్యే దైన్యం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పుష్కలంగా జలాలు



నీళ్లు లేక ఎడారిని తలపిస్తున్న మానేరు వాగు

## మానేరు ఎండింది

సాగు నీటి కోసం అన్నదాత అరిగోస

# బూర్నపల్లి బోరుమంది

**అది జయశంకర్ భూపాలపల్లి జిల్లా** టేకుమట్ల మండలంలోని బూర్నపల్లి గ్రామం.. ఇక్కడ పంట సాగుచేయాలంటే తలాపునే ఉన్న మానేరు వాగు, డీబీఎం 38 కాల్వే దిక్కు. వాగు ప్రవహించినా.. డీబీఎం కాల్వ పారినా ఆ గ్రామ పరిధిలోని వ్యవసాయ బోర్లు, బావుల్లో నీరు పుష్కలంగా ఉండేది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండు వేసవిలోనూ మానేరు వాగు నిండు కుండను తలపించేది. ఇదే చివరి ఆయకట్టు గ్రామమైనా డీబీఎం కాల్వ పొంగి ప్రవహించేది. దీంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాసంగి పంట పండించే వారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మానేరు డిసెంబర్‌లోనే ఎండిపోయింది. ఫలితంగా బోర్లు, బావుల్లో నీరు అడుగంటింది. దీనిని గుర్తించిన పలువురు రైతులు యాసంగి సాగుకు దూరంగా ఉన్నారు. డీబీఎం కాల్వ ద్వారా గోదావరి జలాలు వస్తాయన్న ఆశతో పంట వేసిన రైతులు చుక్క నీరు రాక ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. బావుల్లో పూడిక తీసినా ఫలితం లేకపోవడంతో కళ్లముందే ఎండిపోతున్న పంటను చూస్తూ ఆందోళన చెందుతున్నారు. గురువారం 'నమస్తే తెలంగాణ' ఈ గ్రామాన్ని సందర్శించి రైతులను పలుకరించగా.. సాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మరో నెల దాటితే పంట చేతికొచ్చే పరిస్థితి ఉండదని బోరుమంటున్నారు.

– జయశంకర్ భూపాలపల్లి, మార్చి 6 (నమస్తే తెలంగాణ)

తలాపునే ఉన్న మానేరు వాగు పూర్తిగా ఎండిపోవడంతో సాగు నీరందక బూర్నపల్లి గ్రామం బోరున విలపిస్తున్నది. డీబీఎం 38 కాల్వ ద్వారా చుక్క నీరు రావడం లేదు. కాల్వ మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీంతో బూర్నపల్లితో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరిలోనే సాగునీటి సమస్య తీవ్రమైంది. మరో రెండు నెలలు పంటలు ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. చివరి ప్రయత్నంగా అప్పులు చేసి మరీ బావుల్లో పూడిక తీయిస్తున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో కొందరు రైతులు పంటను మధ్యలోనే వదిలేస్తున్నారు. అప్పుల బాధతో అలమటిస్తున్నారు. గత పదేళ్లలో ఎన్నడూ సాగు నీటికి ఇంత కష్టం రాలేదని, ఇదే మొదటిసారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### కేసీఆర్ పాలనే బాగుండె

కేసీఆర్ పాలనే బాగుండె. ఎన్నడూ నీటి కష్టాలు రాలేదు. మండే ఎండల్లోనూ మానేరు నిండు కుండలా ప్రవహించింది. బావులు, బోర్లలో నీళ్లు పుష్కలంగా ఉండేవి. నాకున్న మూడెకరాల భూమి ఎన్నడూ ఎండిపోలేదు. ఇప్పుడు బావిలో నీళ్లు అడుగంటిపోయాయి. మూడెకరాల్లో వరి సాగుచేస్తే సగం పంటకు నీళ్లు అందుతలేవు. మోటర్ గంట పాటు నడిస్తే బావిలో నీళ్లు అయిపోతున్నయి. రెండెకరాల పంటను వదిలేయాల్సి వస్తుందేమో. ఇటీవల బావిలో రూ. 80 వేలు పెట్టి పూడికతీయించినా ఫలితం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు డీబీఎం 38 కాల్వ ద్వారా నీళ్లు వచ్చినయ్. ఇప్పుడు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అధికారులు నీళ్లు వదిలినా వచ్చే అవకాశం లేదు. ఈ కాల్వ చివరి ఆయకట్టు మాదే. కాళేశ్వరం ప్రాజెక్టు విలువ మాకు ఇప్పుడు తెలిసి వస్తున్నది.

–నేరెళ్ల రామకృష్ణ, రైతు, బూర్నపల్లి



పిచ్చిమొక్కలతో నిండిన డీబీఎం 38 కాల్వ

### బీడుగా మారిన భూములు

బూర్నపల్లితో పాటు పక్కనే ఉన్న వెంకట్రావ్‌పల్లి గ్రామాల పరిధిలోని చాలా మంది రైతులు నీటి సమస్యను ముందే గుర్తించి యాసంగి పంట వేయకుండా పక్కన పెట్టారు. ఇప్పటి వరకు ఎన్నడూ ఎండిపోని మానేరు డిసెంబర్‌లోనే ఎడారిగా మారడంతో అన్నదాతలు చాలా వరకు అప్రమత్తమయ్యారు. సుమారు 100 ఎకరాలను సాగు చేయకుండా వదిలేశారు. ఈ రెండు గ్రామాల పరిధిలో వానకాలంలో సుమారు 630 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఈ యాసంగిలో 520 ఎకరాల్లో పంట సాగవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే మానేరు, డీబీఎం కాల్వలో నీరు లేకపోవడంతో పంట వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం బోర్లు, బావుల కింద 380 ఎకరాలు సాగవుతుండగా, మిగిలిన 140 ఎకరాల్లో పంట ఎండిపోతున్నది. అయితే ఫిబ్రవరిలో 0.48 మీటర్ల మేర భూగర్భ జలాలు అడుగంటాయని ఆ శాఖ అధికారులు ప్రకటించారు. ఎండలు మండిపోతుండడంతో జలాలు మరింత కిందికిపోయే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో మరో రెండు నెలలు నీరందితే పంట చేతికి వస్తుంది. అయితే పరిస్థితి విషమిస్తే మరో 200 ఎకరాల వరకు పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు తెలుపుతున్నారు.

### మూడెకరాలు పడావు పెట్టిన..



నాకు ఐదెకరాల భూమి ఉన్నది. పంట వేసే సమయంలోనే మానేరులో నీళ్లు తగ్గినయ్. ఈ ఏడు నీళ్లగోస వత్తదని అప్పుడే అర్థమై రెండెకరాల్లోనే వరి సాగు చేసిన. మూడెకరాలు పడావు పెట్టిన. మాకు మానేరు, డీబీఎం కాల్వలే దిక్కు. ఈ రెండు లేకపోతే పంటలు ఎండినట్టే. ఇప్పుడు అదే జరుగుతాంది. బావిలో పూడికను జేసీబీతో తీయిస్తున్న. రూ.లక్ష ఖర్చు వత్తాంది. నీళ్లుంటయో, లేదో కాని అప్పులపాలవుతున్నం.

– కాసగాని భిక్షపతి, రైతు, బూర్నపల్లి



జేసీబీతో బావి పూడిక తీపిస్తున్న రైతు



నీళ్లు లేక ఎండిపోతున్న వరిపంట

### అప్పుల బాధతో ఉరేసుకున్నడు



నా భర్త రమేశ్ అప్పుల బాధతో ఏప్రిల్ నెలలో ఉరేసుకొని చనిపోయిండు. మాకున్న రెండెకరాలతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరి వేసినం. నీళ్లందక పొలం ఎండిపోవడం, పంట చేతికి రాకపోవడం, బిడ్డ పెళ్లి చేయడంతో సుమారు రూ. 10 లక్షలకు పైగా అప్పులపాలయ్యాం. అదే సమయంలో కూలిపోతున్న ఇల్లు కట్టినం. ఇంకా అప్పు పెరిగింది. దీంతో ఒక ఎకరం భూమి అమ్మినం. అయినా అప్పులు తీరలేదు. నా కొడుకు ఆటో నడపగా గిరాకీ సరిగా లేక అంతంత మాత్రమే డబ్బులు వచ్చేవి. అవి ఖర్చులకు సరిపోయేవి కావు. దీంతో నా భర్త ఎప్పుడూ రందితో ఉండెటోడు. చనిపోయే ముందు రోజు చాలా ఏడ్చాడు. మరుసటి రోజు చెప్పకుండానే ఇంట్లో నుంచి వెళ్లిపోయి పక్కనే గుట్ట వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు.

– కొండ రజిత, రైతు రమేశ్ భార్య

